టీయూలో కరపత్రాల ఆవిష్కరణ

కరపత్రాలను అవిష్కరిస్తున్న వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, అక్టోబర్ 29: తెలంగాణ యూనివర్సిటీలో నవంబర్ 6న నిర్వహించనున్న 'వన్ డే మ్యాథ మెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం'కు సంబంధించిన కరపత్రాలను టీయూ వీసీ టి.యాదగిరి రావు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, విభాగాధిపతి కె.సంపత్‌కుమార్, అధ్యాపక బృందం డాక్టర్ పురుషోత్తం, రాజేశ్వర్, నర్సింహులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల..

టీయూ పరిధిలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల 3వ, 5వ సెమిస్టర్ (రెగ్యులర్) రెండో, నాల్గవ, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2020-23 బ్యాచ్ విద్యార్థులకు థియరీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారిణి ఆచార్య ఎం. అరుణ మంగళవారం తెలిపారు. నవంబర్‌లో నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించడానికి నవంబర్ 4వ తేదీ వరకు గడువు ఉన్నదని పేర్కొన్నారు. వంద రూపాయల అపరాధ రుసుముతో నవంబర్ 5వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వీసీకి సన్మానం..

టీయూలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావుకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సురేశ్, బికోజీ, డాక్టర్ రవీందర్‌నాయక్, నరేశ్, మహవీర్, సుధీర్ పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, అక్టోబర్ 29: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటరు జాబితాను వెలువరించినట్లు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రతులను మంగళవారం అందజేశారు. అన్ని ఈఆర్వో కార్యాలయాల్లో డ్రాఫ్ట్ రోల్‌ను ప్రచురించినట్లు తెలిపారు. అభ్యంతరాలను నవంబర్ 28వ తేదీలోపు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు వచ్చిన బీసీ కమిషన్ బృందానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. వారికి హారతులు పట్టారు. - ఖిలీల్‌వాడి, అక్టోబర్ 29

నేడు విజయ డెయిరీకి తెలంగాణ పాడీపరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ రాక

సారంగాపూర్, అక్టోబర్ 29: నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ విజయ డెయిరీ కార్యాలయానికి తెలంగాణ పాడీ పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ అమిత్‌రెడ్డి బుధవారం వస్తున్నారని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయాన్ని సందర్శించి పాడీ రైతులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరు కానున్నారని తెలిపారు.

లాభాలు చేకూర్చే పంటలపై అవగాహన కల్పించాలి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రుద్రూర్ వరి పరిశోధన కేంద్రంలో చెరుకును పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రుద్రూర్, అక్టోబర్ 29: రైతులకు లాభాలు చేకూర్చే పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలాల వ్యవసాయాధికారులు, ఏఎంసీ చైర్మన్లతో కలిసి ఆయన రుద్రూర్ వరి పరిశోధన కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ పండిస్తున్న చెరుకు పంట వివరాలను పరిశోధనాకేంద్రం అధిపతి బాలాజీ నాయక్ వారికి వివరించారు. ప్రాజెక్టర్ ద్వారా కేంద్రంలో చేసిన పరిశోధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూనె గింజల ఉత్పత్తి తగ్గడంతో రేట్లు పెరుగుతున్నాయన్నారు. రైతులు కూరగాయలు, నూనె గింజలు, పప్పు దినుసుల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎకరాకు 60టన్నుల చెరుకు దిగుబడి సాధిస్తే.. ఫ్యాక్టరీలు నడపడానికి అవకాశం ఉంటుందన్నారు. చెరుకు పంటను పండించేందుకు కావాల్సిన ఖర్చులను భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఆర్మూర్ ఏఎంసీల చైర్మన్లు ముప్ప గంగారెడ్డి, నర్సయ్య, ముత్యంరెడ్డి, సాయిబాబా, పీసీసీ డెలిగెట్ గంగాశంకర్, బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, ఫుడ్ సైన్స్ కాలేజీ అసోసియేట్ డాక్టర్ కల్పనతోపాటు నాయకులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

'బార్' ఆధ్వర్యంలో గడుగుకు సన్మానం

గడుగు గంగాధర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

వినాయక్‌నగర్, అక్టోబర్ 29: రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియమితులైన సీనియర్ న్యాయవాది గడుగు గంగాధర్‌ను నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు ఆకుల రమేశ్, రాజేందర్ రెడ్డి, హరిప్రసాద్, మధుసూదన్ రావు, ఎన్.ఎల్.శాస్త్రి, భాస్కర్ రావు, కుంట శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలను గడుగు గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శిక్షణ పూర్తిచేసిన ఫ్యాకల్టీకి అభినందన

ఫ్యాకల్టీని అభినందిస్తున్న జీఎంసీ ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఖిలీల్‌వాడి, అక్టోబర్ 29: నిజామాబాద్ మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీ డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ నాగమోహన్‌రావు, డాక్టర్ రేచల్ రవీనా, డాక్టర్ జలగం తిరుపతిరావు కర్ణాటకలో ఏడాది కాలంపాటు అడ్వాన్స్‌డ్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణను పూర్తిచేశారు. సర్టిఫికెట్లు అందుకున్న వారిని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్‌తోపాటు పలువురు అభినందించారు. వీరు కొత్త ఫ్యాకల్టీకి బోధిస్తారని తెలిపారు.

బైపాస్ రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం

ధర్పల్లి, అక్టోబర్ 29: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి సినిమా టాకీస్ మీదుగా బైపాస్ రోడ్డు వరకు విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పీఆర్ ఈఈ శంకర్ తెలిపారు. రోడ్డును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ కోసం రూ.2.3కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు పనులు చేపడితే మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ తెలిపారు. ధర్పల్లి నుంచి రేకులపల్లి రోడ్డు కోసం రూ.4.8 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ అహ్మద్ హుస్సేన్, ఏఈ బాలాజీ, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, నాయకుడు చెలిమెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శవపేటిక అందజేత

డిచ్‌పల్లి, అక్టోబర్ 29: మండలంలోని దూస్‌గాం సూర్య యూత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీకి శవపేటికను మంగళవారం అందజేశారు. వారిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సాయిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వినయ్‌కుమార్, మాజీ సర్పంచ్ దుర్గేశ్, రవిగౌడ్, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రాజు, యూత్ సభ్యులు సుమన్, రాము, లింబాద్రి, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిరికొండ, అక్టోబర్ 29: మండలంలోని చిన్నవాల్గోట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులు మంగళవారం ప్రారంభించారు. రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, గోవర్ధన్, సాయి, గణేశ్, వీడీసీ, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పటాకుల దుకాణాల తనిఖీ

వినాయక్‌నగర్, అక్టోబర్ 29: నిజామాబాద్‌లోని పటాకుల దుకాణాలను స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటుచేసిన షాపులను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని దుకాణాల యజమానులకు సూచించారు. కిసాన్‌గంజ్‌లో ఉన్న హోల్‌సేల్ దుకాణాన్ని తనిఖీ చేసి అక్కడ ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉన్నాయా లేదా తెలుసుకున్నారు.

నగర కమిషనర్ బాధ్యతల స్వీకరణ

కంఠేశ్వర్, అక్టోబర్ 29: మున్సిపల్ కమిషనర్‌గా దిలీప్‌కుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. మేడ్చల్ జిల్లా పరిషత్ సీఈవోగా పని చేసిన ఆయన నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కాగా.. ఇక్కడ బాధ్యతలను చేపట్టారు. దీంతో ఆయనకు నగరపాలక సంస్థ అధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

ఒకరి మృతుకి కారకుడైన వ్యక్తిపై కేసు

వినాయక్‌నగర్, అక్టోబర్ 29: వ్యక్తి మృతికి కారణమైన ఒకరిపై కేసు నమోదైంది. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన అవినాష్ తన బైకుపై మిత్రుడు షేక్ యూసుఫ్‌తో కలిసి ఈనెల 25న వెళ్తున్నాడు. బైక్‌ను అతివేగంగా నడపడంతో యూసుఫ్ కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మృతుడి భార్య రిహానా బేగం ఫిర్యాదు మేరకు అవినాష్‌పై కేసు నమోదు చేసినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు.

దాడి ఘటనలో నిందితుడి రిమాండ్

వినాయక్‌నగర్, అక్టోబర్ 29: డబ్బుల విషయంలో విశ్వనాథ్‌పై సోమవారం కత్తితో దాడి చేసిన ఘటనలో భాస్కర్‌పై త్రీ టౌన్ పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా గరికపూజ

సుభాష్‌నగర్, అక్టోబర్ 29: జిల్లాకేంద్రంలోని గాయత్రీనగర్ సిద్ధిబుద్ధి వినాయక ఆలయంలో మంగళవారం ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి పురస్కరించుకొని 4లక్షల గరికతో ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మచ్చ చంటయ్య పాల్గొన్నారు. రైల్వేగేట్ సార్వజనిక్ గణేశ్ మండలి, ఎన్టీఆర్ చౌరస్తా, శుభం కరోతి గణపతి తదితర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

ధర్పల్లి, అక్టోబర్ 29: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని, అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాలతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు నర్సయ్య, పోతారెడ్డి, రాజన్న, సంతోష్, లచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలి

వినాయక్‌నగర్, అక్టోబర్ 29: టీజీఎస్పీ కానిస్టేబుళ్ల డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం డిస్మిస్ చేసిన పది మంది, సస్పెండ్ చేసిన 39మందిని విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్డెక్కి ధర్నా చేస్తున్న పోలీసుల మానసిక క్షోభను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు.

జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కోటగిరి(పోతంగల్), అక్టోబర్ 29: ఎన్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఖోఖో పోటీలకు అండర్17 విభాగంలో జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపికను మంగళవారం నిర్వహించారు. రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. నవంబర్ ఒకటో తేదీన ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయులు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో పీడీ, పీఈటీలు ప్రతిభ, సంతోషిణి, విశాల్, సాయికుమార్, సంజీవ్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ పరిశీనలకు త్వరలో ఇంజినీర్ల బృందం

బోధన్, అక్టోబర్ 29: 2015లో లే ఆఫ్ చేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ యంత్రాల ప్రస్తుత పరిస్థితిపై ఇంజినీర్ల బృందంతో త్వరలో అధ్యయనం చేయిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన శక్కర్‌నగర్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ యంత్రాల కండీషన్‌పై ఇంజినీర్లతో అధ్యయనం చేయించి, సీఎంతో చర్చిస్తామన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బోధన్ తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

నేడు మోర్తాడ్‌లో బీఆర్ఎస్ సంబురాలు

మోర్తాడ్, అక్టోబర్ 29: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఉదయం 11 గంటలకు మోర్తాడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకోవాలని ఆపార్టీ మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు కల్లెడ ఏలియా, రేగుంట దేవేందర్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. విద్యుత్ చార్జీలు పెంచకుండా బీఆర్ఎస్ అడ్డుకోవడంతో ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నదని పేర్కొన్నారు. దీంతో మోర్తాడ్ బస్టాండ్ వద్ద నియోజకవర్గ స్థాయి సంబురాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన

జెస్సు వెంకట్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్29: వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించిన పట్టణానికి చెందిన జెస్సు వెంకట్‌ను ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మంగళవారం మండలంలోని అంకాపూర్‌లో సన్మానించారు. పట్టణానికి చెందిన జెస్సు శ్రీనివాస్, స్రవంతి కుమారుడు వెంకట్ హైదరాబాద్‌లో ఇటీవల వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 120 కిలోల విభాగంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించాడు.

నిత్యం యోగా చేయాలి

మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

మాక్లూర్, అక్టోబర్ 29: విద్యార్థులు నిత్యం యోగా చేయాలని, పోషకాహారం తీసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు సూచించారు. దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ మందులకు అలవాటు పడకుండా ఉండాలని అన్నారు. విద్యార్థులకు ఆయూష్ ఆరోగ్య కరదీపిక పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వందన, డాక్టర్ తిరుపతి, ఫార్మసిస్ట్ పురుషోత్తం, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

బోధన్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

- **బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

బోధన్/ రెంజల్/ బోధన్ రూరల్/ వేల్పూర్, అక్టోబర్ 29: రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర అందిస్తామని, ఆందోళన చెందవద్దని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఏఎంసీ చైర్పర్సన్ అంకు సంధ్యా దాముతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేపట్టనున్నదని అన్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి కూడా సన్నబియ్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, వైస్ చైర్మన్ చీల శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్, కార్యదర్శి ఉమాకాంత్, నాయకులు పాల్గొన్నారు. రెంజల్‌లో ఐకేపీ, సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రెంజల్ విండో చైర్మన్ మొహినుద్దీన్, మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీఎం చిన్నయ్య, ధనుంజయ, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు. బోధన్ మండలంలోని పెగడపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పెంటాకలాన్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. వేల్పూర్ మండలంలోని పడిగెల్‌లో కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ యాల్ల హన్మంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అంబులెన్సు ప్రారంభం

బోధన్, అక్టోబర్ 29: పట్టణంలోని లయన్స్ కంటి దవాఖాన కొత్త అంబులెన్సును బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్పర్సన్ తూము పద్మావతీ శరత్‌రెడ్డి, మాజీ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లక్ష్మీ బసవేశ్వర్‌రావు, బసవేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నందిపేట్/రెంజల్, అక్టోబర్ 29: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐపీకేఎస్ నాయకుడు అనంతరావు ఆధ్వర్యంలో నాయకులు నందిపేట్ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు పాల్గొన్నారు. రెంజల్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. 58 ఏండ్లు నిండిన రైతులకు రూ.10వేల పింఛన్ అందించాలని కోరారు.నాయకులు పుట్టి నాగన్న, ఒడ్డెన్న, నసీర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

మోర్తాడ్, అక్టోబర్ 29: రంగోత్సవ సెలబ్రేషన్స్‌లో సుంకెట్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సవిత, అశ్విత, అభిగ్న బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. వీరిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు గంగాధర్, అంగన్‌వాడీ టీచర్ శృతి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వినోద్, నరేశ్ అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ముంబైలో నిర్వహించిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌కు విద్యార్థినులు వేసిన చిత్రాలను పంపించగా వారికి పతకాలు వచ్చాయని చెప్పారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్29: పట్టణంలోని పలు స్వీట్ హోంలు, బేకరీలు, హోటళ్లు, దుకాణాలను మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. నిబంధనలు పాటించని పలు దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది, యువ రాము, సంతోష్, నర్సయ్య, నరేశ్, అక్షయ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన నేతలు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో మాదిగ సంఘాల నాయకులు

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్29: వివిధ మాదిగ సంఘాల రాష్ట్ర నేతలు మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని తన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర మాదిగల సంఘం అధ్యక్షుడు కొక్కెర భూమన్న, మాదిగ హక్కుల దండోరా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ, టై, బెల్టుల వితరణ

మాక్లూర్, అక్టోబర్29: మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా కేంద్రానికి చెందిన సుఖీభవ దవాఖాన వైద్యులు భాస్కర్‌రెడ్డి, కమల్‌రాజ్ గౌడ్ మంగళవారం టై, బెల్టులు అందజేశారు. రతన్‌టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు లింగన్న, ప్రసాద్‌రెడ్డి టీవీని పాఠశాలకు అందజేశారు. హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు చందాలుగా వేసుకొని తరగతి గదులు, గోడలకు రూ.70వేలతో రంగులు వేయించగా వీరిని గ్రామస్తులు, వీడీసీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు విస్తృత ఏర్పాట్లు

కంఠేశ్వర్, అక్టోబర్ 29: రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల వివరాల సేకరణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క సూచించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ప్రశ్నావళికి అనుగుణంగా సమాచారం సేకరించాలన్నారు. సర్వే తీరును రోజూ పరిశీలించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ